క్లుప్తంగా

నేడు రథసప్తమి వేడుక

ప్రొద్దుటూరు : మండలంలోని కామనూరు శ్రీ ప్రసన్న వేణుగోపాల మాధవ గో సంరక్షణశాలలో మంగళవారం ఉదయం 8 గంటలకు రథ సప్తమి వేడుకలను నిర్వహించనున్నట్లు గోశాల కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. సూర్య భగవానుడికి పొంగలిని నైవేద్యంగా సమర్పించనున్నట్లు చెప్పారు. ముడియం కృష్ణమూర్తి, సుబ్బరత్నమ్మ చారిటబుల్ ట్రస్టు వారు భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.

వార్డులలో కమిషనర్ పర్యటన



సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున పర్యటించారు. మడూరు ఛానల్‌లో సీల్ట్‌ను పారిశుద్ధ్య కార్మికులతో తొలగించారు. కొత్తగా ఏర్పాటు చేసిన గ్రిల్‌ను కమిషనర్ పరిశీలించారు. పట్టణంలోని అన్ని షాపులకు సంబంధించి ట్రేడ్ లైసెన్స్ నోటీసులు జారీ చేసి వారి ద్వారా ధృవీకరణ పత్రం పొంది, ట్రేడ్ లైసెన్స్‌లను వసూలు చేయాలని వార్డు శానిటేషన్ సెక్రటరీలను కమిషనర్ ఆదేశించారు. లేని వాటికి కొత్తగా ట్రేడ్ లైసెన్స్ జారీ చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉర్దూ కళాశాల వద్ద ఉన్న చెత్త పాయింట్ వద్ద పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. కేహెచ్‌ఎం స్ట్రీట్‌లోని మున్సిపల్ మహిళా పార్కును కమిషనర్ సందర్శించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సుబ్బరాయుడు, నూర్‌బాషా పాల్గొన్నారు.

5న పెన్షనర్ల సమావేశం

మైదుకూరు : ఈనెల 5న నిర్వహించే మండల పెన్షనర్ల సంఘం సమావేశంలో మండలంలోని పెన్షనర్లు అందరూ పాల్గొనాలని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చిగురుపాటి సుబ్బరాయుడు, ఏవీ రమణయ్య ఒక ప్రకటనలో కోరారు. స్థానిక సాయినాథపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో సాయంత్రం 5 గంటలకు నిర్వహించే సమావేశంలో పెన్షనర్ల భవన నిర్మాణం గురించి, ఇతర సమస్యలపై చర్చిస్తామని వారు పేర్కొన్నారు.

సైబర్ నేరాల నివారణపై అవగాహన

మైదుకూరు : సైబర్ నేరాల నివారణ, ఆర్థిక అక్షరాస్యత పట్ల అందరూ అవగాహన పెంపొందించుకోవాలని మండలంలోని వనిపెంట భారతీయ స్టేట్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ మేనేజర్ కె.ఉదయ్ అన్నారు. గంజికుంటలో సోమవారం రిజర్వ్ బ్యాంకు సౌజన్యంతో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో డిపాజిటర్ ఎడ్యుకేషన్ అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, పొదుపు సంఘాల మహిళలు సైబర్ క్రైమ్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఫోన్లలో వ్యక్తిగత సమాచారాలు, ఓటీపీలు షేర్ చేయరాదని సూచించారు. కార్యక్రమంలో ఏపీజీబీ రిటైర్డు మేనేజర్ కృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు పెరుగు కృష్ణయ్య యాదవ్, కోఆర్డినేటర్ ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

కబ్జా స్థలాలను స్వాధీనం చేసుకోవాలి

అట్లూరు : బద్వేలు పట్టణంలోని వివిధ సర్వే నంబర్లలో ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకోవాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు సంగటి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని సోమవారం మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేలు, చెన్నంపల్లె, గుంతపల్లె, మడకలవారిపల్లె రెవెన్యూ పొలాల్లో సుమారు 70కు పైగా సర్వే నంబర్లలో విలువైన ప్రభుత్వ స్థలాలు, రస్తాలు ఆక్రమణకు గురయ్యాయని, తక్షణమే ఆక్రమణలను తొలగించి స్థలాలను స్వాధీనం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు చంద్రమోహన్‌రాజు, జకరయ్య, ఏరియా నాయకులు అనిల్, సంజీవ్, బాబు, చంద్రపాల్, ప్రసాద్, లూకయ్య, ఈశ్వర్ పాల్గొన్నారు.

మార్కెట్‌లో ధరల పట్టిక ఏర్పాటు చేయాలి



వ్యాపారస్తులతో మాట్లాడుతున్న కమిషనర్

బద్వేలు అర్బన్ : కూరగాయల మార్కెట్‌లో వ్యాపారస్తులు తప్పనిసరిగా ధరల పట్టిక ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి సూచించారు. సోమవారం పోరుమామిళ్ల రోడ్డులోని మార్కెట్‌ను పరిశీలించిన అనంతరం వ్యాపారస్తులతో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ధరల పట్టిక ఏర్పాటు చేసి అందులో ఉన్న ధరల ప్రకారం కూరగాయలు విక్రయించాలన్నారు. అలాగే మార్కెట్‌కు లోపల, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా సహకరించాలని కోరారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వీలైనంత త్వరగా వ్యాపారస్తులందరూ ధరల పట్టిక ఏర్పాటు చేయాలని కోరారు.

వ్యాపార కేంద్రం.. జూదాల నిలయం!

- ప్రొద్దుటూరులో యథేచ్ఛగా పేకాట, క్రికెట్ బెట్టింగ్, ఇసుక అక్రమ రవాణా
- కూటమి ప్రభుత్వంలో విచ్చలవిడిగా సాగుతున్న అసాంఘిక కార్యకలాపాలు
- క్లబ్‌లలో దర్శనమిస్తున్న పేక ముక్కలు
- ఆచరణకు నోచుకోని ఎమ్మెల్యే వరద ప్రకటనలు



ప్రొద్దుటూరు : ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే ప్రొద్దుటూరు నియోజకవర్గంలో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుఅదుపు లేకుండా పోయింది. అధికార పార్టీ నేతలే అసాంఘిక కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నారు. తమ పార్టీ వారే కదా.. వదిలేయండని చెబుతున్న సంఘటనలు కూడా ఉన్నాయి. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అనుచరుడైన 19వ వార్డు కౌన్సిలర్ మునీర్ అహ్మద్ మట్కా రాస్తూ పట్టుబడటంతో అతనిని పోలీసులు అరెస్టు చేసిన సంఘటన ఇటీవలే జరిగింది. మట్కాతోపాటు క్రికెట్ బెట్టింగ్, గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నాయి.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డేది

రాష్ట్రంలోనే ప్రొద్దుటూరు వివిధ వ్యాపారాలకు కేంద్రంగా ప్రసిద్ధికెక్కింది. అలాంటి ప్రొద్దుటూరులో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అసాంఘిక కార్యక్రమాలను అడ్డుకునే పరిస్థితి లేకుండా పోయింది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పట్టణంలోని ప్రధానమైన రెండు క్లబ్‌ల్లో పేకాటకు బ్రేక్ వేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఐదేళ్లపాటు పేకాట ఊసే లేకుండా పోయింది. కూటమి అధికారంలోకి వచ్చాక క్లబ్‌ల్లో యథావిధిగా పేకాట సాగుతోంది. ఈ అంశంపై మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఇప్పటికే రెండు మార్లు ప్రకటన చేశారు. పేకాటను నివారించకపోతే స్వయంగా జార్జి క్లబ్ వద్ద దీక్షా శిబిరం వేస్తానని హెచ్చరించిన విషయం తెలిసిందే. జార్జి క్లబ్‌లో పేకాటకు అనుమతి ఇవ్వాలని స్వయంగా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి గతంలో ఎస్పీని కోరినట్లు రాచమల్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చౌటపల్లె గ్రామంలో అధికార పార్టీ నేతలు జూదం నిర్వహించారు. పలుమార్లు పోలీసులు హెచ్చరించడంతో కూటమి నేతలు వెనక్కితగ్గారు. రామాపురం, చౌడూరు గ్రామాల్లో నేతలు విచ్చలవిడిగా ఇసుకను అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. చౌడూరు నుంచి పదుల సంఖ్యలో ఇసుకను పక్క జిల్లాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో పోలీసులు హెచ్చరించినా అధికార పార్టీ నేతల అండతో అసాంఘిక కార్యకలాపాలను నివారించలేని పరిస్థితి ఏర్పడింది. క్రికెట్ బెట్టింగ్, మట్కాతోపాటు రేషన్ బియ్యం అక్రమ రవాణా విచ్చలవిడిగా సాగుతోంది. ఎప్పటి నుంచో ప్రొద్దుటూరులో క్రికెట్ బెట్టింగ్, మట్కా ఉన్నా పరిమితిలో ఉండేది. ప్రస్తుతం ఈ దందాలు అడ్డుఅదుపు లేకుండా సాగుతున్నాయి. అధికార పార్టీ నేతలే ఇందులో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. పట్టణ పరిధిలోని ఆర్ట్స్ కాలేజీ రోడ్డు, దస్తగిరిపేట, శ్రీనివాసనగర్, జిన్నా రోడ్డు, హైదర్‌ఖాన్ వీధి, ఆణ బంకు, ఈశ్వర్‌రెడ్డినగర్, పెన్నానగర్ ప్రాంతాల్లో సుమారు వంద మంది మట్కా బీటర్లు ఉన్నట్లు సమాచారం. దాదాపు 20 మంది మట్కా కంపెనీలను నిర్వహిస్తున్నారు. రోజు కోట్ల రూపాయల్లో టర్నోవర్ జరగుతోంది. తద్వారా పేదల జీవితాలు బుగ్గిపాలవుతున్నాయి.

క్రికెట్ బెట్టింగ్‌ను అదుపు చేసేనా?

పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులు ఉన్నారు. పోలీసులు గుర్తించిన వారినే మళ్లీ మళ్లీ అరెస్టు చేయడం తప్ప కొత్తవారి జోలికి వెళ్లడం లేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా ఎస్పీ, డీఎస్పీ స్థాయిలో తరుచూ దాడులు నిర్వహించి ఇలాంటి వాటిని అరికట్టేవారు. కూటమి పార్టీలు అధికారం చేపట్టినప్పటి నుంచి పోలీసు యంత్రాంగం దాడులను మరిచిపోయింది. గత ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రొద్దుటూరులో మట్కా, గుట్కా, క్రికెట్ బెట్టింగ్, ఇసుక అక్రమ రవాణా విచ్చలవిడిగా ఉందని, తాను ఎమ్మెల్యేగా ఎన్నికైతే వీటిని రూపుమాపుతానని బహిరంగంగా ప్రకటించారు. ఆయన చెప్పిన మాటలు ఇప్పటి వరకు ఆచరణకు నోచుకోకపోవడమే కాక రెట్టింపు అయ్యాయి. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సుమారు వంద మంది పాత రేషన్ డీలర్లను తొలగించి అధికార పార్టీ నేతలు డీలర్లుగా వ్యవహరిస్తున్నారు. కొంత మంది కౌన్సిలర్లు కూడా ఈ వ్యాపారంలో మునిగితేలుతున్నారు. బెల్టు షాపుల నిర్వహణ గ్రామాల్లో విచ్చలవిడిగా సాగుతోంది. గ్రామస్థాయిని బట్టి రెండు మూడు షాపులను నిర్వహిస్తున్నారు. పట్టణంలోని కొన్ని మద్యం షాపుల యజమానులు పక్కన రూములను తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగ్ రూంలను ఏర్పాటు చేస్తున్నారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అశోక్ కుమార్ ఆదివారం ప్రొద్దుటూరులో పర్యటించారు. అలానే ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ పి.భావనతో పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే త్రీటౌన్ పోలీసులు క్లబ్ నిర్వాహకులను పిలిపించి పేకాట ఆడవద్దని హెచ్చరించారు. ఇతర ఆటలు ఏమాడుకున్నా తమకు సంబంధం లేదని పేకాట ముక్కలు మాత్రం క్లబ్‌లో కనిపించకూడదని హెచ్చరించినట్లు సమాచారం. కొత్త ఎస్పీ, డీఎస్పీల రాకతోనైనా ప్రొద్దుటూరులో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్టపడుతుందా.. అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ప్రొద్దుటూరులో రష్మీ గౌతం సందడి



జ్యోతీప్రజ్వలన చేస్తున్న రష్మీ గౌతమ్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక టూటౌన్ బైపాస్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సాహితీ టైల్స్ మాల్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, జబర్దస్త్ యాంకర్ రష్మీ గౌతమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాయలసీమలోనే అతిపెద్ద టైల్స్ మాల్‌ను పట్టణంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు. మాల్ యాజమాన్యం కె.శ్రీనివాసులు, ప్రవీణ్ కుమార్‌లు మాట్లాడుతూ మా దగ్గర అన్ని వర్గాల వారికి ఉపయోగపడే విధంగా అందరికీ అందుబాటు ధరల్లో నాణ్యమైన టైల్స్ లభిస్తాయని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యాంకర్ రష్మీ గౌతమ్ మాట్లాడుతూ తాను గతంలో నాలుగు సార్లు పట్టణానికి వచ్చానని, ప్రొద్దుటూరు ప్రజల అభిమానం మరువలేనిదన్నారు. రష్మీని చూడటానికి ప్రజలు, అభిమానులు అధిక సంఖ్యలో ఆ ప్రాంతానికి చేరుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి, సర్పంచ్ శివచంద్రారెడ్డి, ముక్తియార్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకుండా జగన్‌పై ఆరోపణలు

- చంద్రబాబుపై మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ధ్వజం
- 12న ఫీజు పోరును విజయవంతం చేయాలని పిలుపు
- వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పోస్టర్ల ఆవిష్కరణ



ఫీజుపోరు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తదితరులు

మైదుకూరు : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెవవేర్చకుండా చంద్రబాబు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నెపం వేస్తూ ఆరోపణలు చేయడం శోచనీయమని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ధ్వజమెత్తారు. ఈనెల 12న వైఎస్సార్‌సీపీ జరుపతలపెట్టిన ఫీజు పోరుపై స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురామిరెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు ఎంతో మేలు చేసిందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు గడపగడపకు తిరిగి సమస్యలను తెలుసుకున్నామని, ప్రభుత్వం చేసిన మేలును వివరించామని పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పరిస్థితి చూస్తే 8 నెలలు గడిచిపోయాయని, కూటమి నాయకులు ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకునే ధైర్యం చేయలేకున్నారని విమర్శించారు. అంతా షో చేస్తున్నారని, సూపర్ సిక్స్ పేరుతో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా జగన్‌పై నెపం వేస్తున్నారే తప్ప, ఈ 8 నెలల్లో వారేం చేశారో చెప్పలేకపోతున్నారన్నారు. చంద్రబాబు 2014 ఎన్నికల ముందు రైతులకు, మహిళలకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక నెరవేర్చకుండా మోసం చేశారన్నారు.

విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నారు

ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవిత్యాన్ని నాశనం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ధ్వజమెత్తారు. మార్చిలో పరీక్షలు ఉన్నాయని, ఫీజులు కట్టని వారిని పరీక్షలు రాయనివ్వమని కాలేజీల యాజమాన్యాలు చెబుతున్నాయన్నారు. అలాంటప్పుడు వారి భవిష్యత్తు ఏం కావాలని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి ఏడాదికి రూ.18వేల కోట్లు ఫీజులు చెల్లించారని, చంద్రబాబు హయాంలో పేరుకుపోయిన రూ.2,600 కోట్ల బకాయిలను కూడా చెల్లించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఈ 8 నెలల కాలంలో రూ.3,900 కోట్ల బకాయిలు పెట్టిందని తెలిపారు.

ఫీజు పోరును విజయవంతం చేయండి

వైఎస్సార్‌సీపీ చేపట్టిన ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రఘురామిరెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 12న జిల్లా కేంద్రం కడపలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అమలు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని ఇవ్వనున్నట్టు తెలిపారు. పార్టీ నాయకులతో కలసి ఫీజు పోరు కరపత్రాలను ఆవిష్కరించారు.

ఫీజు పోరును జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు ఈనెల 12న కడపలో నిర్వహించనున్న ఫీజు పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఫీజు పోరు పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో 12న నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కార్యక్రమానికి పార్టీ శ్రేణులు తరలి వెళతారన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, బాణా కొండారెడ్డి, చౌడం రవి, బీఎస్‌ఆర్, దేస్ రామ్మోహన్‌రెడ్డి, కమల్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యంలో కోతలు.. పట్టించుకోని అధికారులు

చాపాడు : మండలంలోని రాజుపాళెం, వెదురూరు, నరహరిపురం, తిప్పిరెడ్డిపల్లె, ఖాదర్‌పల్లె గ్రామాలతో పాటు ఇంకా పలు గ్రామాలలో ఫిబ్రవరి నెలలో చేపట్టిన బియ్యం పంపిణీలో రేషన్ డీలర్లు కోతలు పెడుతున్నారు. గత రెండు రోజులుగా మండల వ్యాప్తంగా రేషన్ డీలర్లు బియ్యం పంపిణీ మొదలు పెట్టారు. అయితే ప్రతి గ్రామంలో రైస్ కార్డుపై రెండు నుంచి ఐదు కిలోలు తగ్గిస్తుండగా, రాజుపాళెం, వెదురూరు, నరహరిపురం, తిప్పిరెడ్డిపల్లె గ్రామాలలో పది కిలోలకు రెండు కిలోలు చొప్పున 35 కిలోలకు 7 కిలోలు తగ్గించి ఇస్తున్నారు. దీనిపై ఆదివారం వెదురూరు గ్రామంలో కార్డుదారులు డీలర్‌ను నిలదీయగా రేషన్ పంపిణీని అర్ధాంతరంగా ఆపేశారు. మిగిలిన గ్రామాలలో తమ ఎలాంటి భయం లేదని తామిచ్చినట్లే రేషన్ బియ్యం తీసుకెళ్లాలనే ధోరణిలో వారి ఇష్టానుసారంగా రేషన్ పంపిణీలో కోతలు పెట్టి ఇస్తున్నారు. అదే విధంగా ప్రతి చౌక దుకాణంలో చక్కెర మినహా ఎలాంటి సరకులు ఇవ్వలేదని కార్డుదారులు చెబుతున్నారు.

డిప్యూటీ తహసీల్దారు ఏమన్నారంటే..

మండలంలో రేషన్ పంపిణీలో కోతలు, సక్రమంగా జరగని పంపిణీపై డిప్యూటీ తహసీల్దారు కృష్ణారెడ్డిని వివరణ కోరగా.. ఈ నెలలో బియ్యం పంపిణీ అలాట్‌మెంట్‌తో తగ్గించి ఇచ్చారని, పూర్తి స్థాయిలో బియ్యం అందించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కార్డుదారులకు పూర్తి స్థాయిలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వేసవిలో నీటి ఇక్కట్లు రాకుండా చూడాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజాపక్షం నాయకులు

ప్రొద్దుటూరు : తాగునీటి సమస్య నుంచి రాయలసీమ ప్రజలను ఆదుకోవాలని ప్రజాపక్షం పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం తహసీల్దార్ గంగయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం డ్యాంలో జనవరికే 885 అడుగుల నుంచి 854 అడుగుల దిగువకు నీటి మట్టం చేరిందన్నారు. ప్రస్తుతం 853 అడుగులలో 87 టీఎంసీల నీటి మట్టానికి తగ్గిపోవడంతో రాయలసీమ ప్రజలకు తాగునీరు అందే అవకాశాలు తగ్గుతాయన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వద్ద 840 అడుగుల నీటి మట్టానికి కేవలం 10 రోజులకే పడిపోయే పరిస్థితులు ఉన్నాయన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి తెలంగాణ ప్రభుత్వం కృష్ణా యాజమాన్య బోర్డు అనుమతి లేకుండా ఎడమ గట్టు పవర్ జనరేషన్ ద్వారా యథేచ్ఛగా నీటిని వాడుకుంటోందన్నారు. దీని వల్ల వేసవిలో రాయలసీమ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అబ్దుల్ రహీం, రామ్మోహన్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, ప్రతాప్, రాము, బాలిరెడ్డి, ఎల్లయ్య పాల్గొన్నారు.

సకల విద్యాప్రదాయినీ.. సరస్వతీ నమోస్తుతే



ప్రొద్దుటూరు కల్చరల్: ప్రత్యేక అలంకరణలో అష్టాదశ శక్తిపీఠాలలోని సరస్వతీదేవి



ప్రొద్దుటూరు కల్చరల్: వైఎంఆర్ కాలనీ సరస్వతీదేవి ఆలయంలో అక్షరాభ్యాసంలో చిన్నారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : వసంత పంచమి సందర్భంగా చదువులమ్మ సరస్వతీ దేవికి సోమవారం పట్టణంలోని పలు ఆలయాలు, పాఠశాలల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు చిన్నారులపై ఉండాలని కోరుతూ అక్షరాభ్యాసాన్ని చిన్నారులకు చేయించారు. అలాగే లోక కల్యాణార్థం సరస్వతీ హోమాన్ని నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని సరస్వతీ విద్యామందిర్‌లోని సరస్వతీ దేవి ఆలయంలో వసంత పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. పూజాకార్యక్రమానంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పెన్నానదీ తీరంలోని శ్రీ అమృతేశ్వర స్వామి ఆలయం అష్టాదశ శక్తి పీఠాలలోని సరస్వతీ దేవి అమ్మవారికి వసంత పంచమి సందర్భంగా పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొవ్వూరు రమేష్‌రెడ్డి, సెక్రటరీ నామావాసు, వైస్‌ప్రెసిడెంట్ వీసీఎస్ మనోహర్, ట్రెజరర్ కిరణ్ కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పలు పాఠశాలల్లో సరస్వతీ పూజ చేసి అమ్మవారి కృప అందరికి ఉండాలని చదువులమ్మను ప్రార్థించారు.

వైభవంగా సామూహిక అక్షరాభ్యాసం

బద్వేలు అర్బన్ : స్థానిక పోరుమామిళ్లరోడ్డులోని సరస్వతి శిశుమందిరంలో మాఘశుద్ధ వసంత పంచమి, సరస్వతి దేవి జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం సామూహిక అక్షరాభ్యాసం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం నుంచి గణపతి పూజ, సంకల్పము, అగ్ని ప్రతిష్ఠాపన, గాయత్రీ యజ్ఞము, అక్షర స్వీకారము తదితర విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సరస్వతి శిశుమందిరం సభ్యులు తులసి వెంకటశివానంద, పల్లెంశెట్టి శ్రీనివాసులు, పెద్ది సుధాకర్, బోలా నారాయణ, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కలసపాడు : స్థానిక సెయింట్ ఆంటోనీస్ ఉన్నత పాఠశాలలో సోమవారం వసంత పంచమి వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ చిత్తారాజశేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు చిత్తాప్రభావతిల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా తొలుత 50 మంది విద్యార్థుల తల్లిదండ్రులతో జ్యోతిప్రజ్వలన చేసి సర్వమత సమ్మేళనానికి అనుకూలంగా ప్రార్థనలు చేసి బిడ్డలను ఆశీర్వదించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ చిత్తారాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నారి బిడ్డల ఉజ్వల భవిష్యత్తు కోసం వసంత పంచమి రోజున అక్షరాభ్యాసం చేయించడం చాలా మంచిదని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, చిన్నారులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా స్కూల్ తనిఖీ

చాపాడు : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను సోమవారం ప్రొద్దుటూరు డిప్యూటీ ఈఓ మీనాక్షి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను పరిశీలించి, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుపట్టికలను పరిశీలించారు. పాఠశాల ఆవరణను, స్కూల్‌లో విద్యార్థులు అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతులపై ఆరాతీశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఈఓ మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. తరగతిలో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వాటి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 వంశీకృష్ణ, కస్తూర్బా ప్రత్యేకాధికారి నాగలక్ష్మీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్టైఫండ్ పెంచాలని విద్యార్థుల నిరసన

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని గోపవరం గ్రామ సమీపంలో ఉన్న పశువైద్య కళాశాలలో ఇంటర్న్‌షిప్ చేస్తున్న విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలని సోమవారం కళాశాల అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా 4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థి శివతరుణ్ మాట్లాడుతూ 2013 నుంచి ఇప్పటి వరకు తమకు స్టైఫండ్ కేవలం రూ.7వేలు ఇస్తున్నారన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ఈ స్టైఫండ్ ఏమాత్రం సరిపోదన్నారు. ఎంబీబీఎస్ విద్యార్థులతో సమానంగా తాము కూడా ఐదున్నరేళ్లు చదువుతున్నామని, వారికి మాత్రం స్టైఫండ్ రూ.26వేలు ఉందన్నారు. ప్రభుత్వం చొరవ చూపి పశువైద్య విద్యార్థులకు కూడా రూ.26వేలు స్టైఫండ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి నేతలకు చట్టంపై గౌరవం లేదు

చాపాడు : తిరుపతి డిప్యూటీ మేయర్, హిందూపురం మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని, చట్టాన్ని, న్యాయాన్ని రక్షించాల్సిన పోలీసుల ఎదుటే దౌర్జన్యాలు జరుగుతుంటే ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం రెడ్యం విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి ఎన్నికల్లో పాల్గొనేందుకు బస్‌లో వెళ్తుంటే బస్‌ను పగులగొట్టి కార్పొరేటర్లను కిడ్నాప్ చేస్తుంటే పోలీసులు పట్టించుకున్న పాపానపోలేదన్నారు. ఇది కూటమి ప్రభుత్వ వైఫల్యానికి పరాకాష్ట అని మండిపడ్డారు. హిందూపురంలో ఎమ్మెల్యే బాలకృష్ణకు ప్రజాస్వామ్యంపై, ప్రజాబలంపై విశ్వాసం ఉంటే వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి చేరిన కౌన్సిలర్లతో రాజీనామా చేయించి తిరిగి ఎన్నికలు జరిపించాలని డిమాండ్ చేశారు.

కనుల పండువగా మాధవరాయస్వామి కల్యాణం



మాధవరాయస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

మైదుకూరు : మైదుకూరులో శ్రీలక్ష్మీ మాధవరాయ స్వామి ఆలయంలో సోమవారం రాత్రి స్వామివారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా జనవరి 15వ తేదీన కనుమ పండుగ రోజున మాధవరాయస్వామి పార్వేట నిర్వహించిన విషయం తెలిసిందే. మైదుకూరు పరిసర గ్రామాల్లో 18 రోజులపాటు పార్వేట ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, ఊరేగింపు నిర్వహించిన అనంతరం ఆదివారం రాత్రి మాధవరాయస్వామి తిరిగి ఆలయానికి చేరుకున్నారు. సోమవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత మాధవరాయ్వామికి కల్యాణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కల్యాణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. ఆలయ చైర్మన్ బండిబెల్లం సుబ్బరాయుడు, మాజీ చైర్మన్లు సింగయ్యగారి రామమోహన్, సూరమ్మగారి సుబ్బరాయుడు, బెల్లం ఉజ్జి, కార్యనిర్వాహణాధికారి ప్రసాదరావు పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో శ్రీదేవి, భూదేవి సమేత మాధవరాయస్వామికి విజయోత్సవాన్ని (గ్రామోత్సం) నిర్వహించారు. పట్టణంలో ఇంటింటి వద్ద భక్తులు స్వామివారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి పూజలు నిర్వహించారు.


రహదారి భద్రతా నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్టీఓ మురళీధర్

ప్రొద్దుటూరు క్రైం : రహదారి భద్రతా నియమాలను పాటించి ప్రమాదాలను నివారించాలని ఆర్టీఓ మురళీధర్ తెలిపారు. స్థానిక వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీలో రహదారి భద్రతపై సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ బైక్ నడిపే విద్యార్థులు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. కారులో ప్రయాణించేవారు సీటు బెల్ట్ వాడాలని సూచించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్ వినియోగించకూడదని తెలియజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.తిరుపతిరావు మాట్లాడుతూ రహదారి భద్రతా నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందన్నారు. డ్రైవింగ్ వ్యక్తిగత అనుభవంగా కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించాలని చెప్పారు. వాహనాలు కండీషన్‌లో లేకపోవడం, అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, అవగాహన లోపంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంవీఐ హేమకుమార్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నివాళి



తులసమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : బద్వేలు మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి మాతృమూర్తి వాకమళ్ళ తులసమ్మ ఆదివారం మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ సోమవారం పంగావాండ్లపల్లెలో తులసమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తులసమ్మ గ్రామీణ ప్రాంతంలో పుట్టినప్పటికీ పిల్లలను కష్టపడి చదివించి వారిని ఉన్నత స్థితిలో నిలపడానికి ఎంతో కృషి చేశారని అన్నారు. ఆమె లేని లోటు కుటుంబ సభ్యులకు తీర్చలేనిదని, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కోరారు. అలాగే విషయం తెలిసిన వెంటనే కడప ఎంపీ వైఎస్‌అవినాష్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డిని ఫోన్‌లో పరామర్శించారు. అలాగే వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యెం వెంకటసుబ్బారెడ్డి తులసమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మాజీ కుడా చైర్మన్ గురుమోహన్, మున్సిపల్ వైస్‌చైర్మన్లు గోపాలస్వామి, ఆర్.వి.సాయిక్రిష్ణ, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నగర విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బంగారుశీనయ్య, పురప్రముఖులు తులసమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.